కథానిక :

# తాలూకా గుమాస్తా

## 'అమరేంద్ర'

"ఇదేమిటోయ్ పూర్ణచంద్రరావ్ ! నువ్వేనా ఎవరో అనుకున్నా సుమా. ఇక్కడున్నావేమిటి ? అరెరె ఎంతపని జరిగింది !" అంటూ ఆశ్చర్యంతో కూడిన పరామర్శ చేశాడు ఆనందరావు.

ఊపిరి పీల్చుకోటానిక్కూడా తీరికలేకుండా కాగితాల దస్త్రాల మధ్య పడి నలిగి పోతున్న పూర్ణచంద్రరావు ఎవరీమనిషి అని తల ఎత్తి చూచాడు. వెంటనే తల వాల్చేశాడు. ఆనందరావుముఖం చూడలేక పోయాడు. తను ఏదో నీచమైన పనికి దిగినవాడిలాగా సిగ్గుతో మగ్గిపోయాడు. అందరినీ ఎంతో మోసంచేసిన వంచకుడిలాగా దొరికిపోయిన దొంగలాగా అణగదొక్క అభిమానంతో కుంగిపోయాడు. అప్రయత్నంగా అతని గుడ్లని బిగ్గలు కొట్టుకుంటూ నీటిచుక్కలు దస్త్రాలమీద టప్ టప్ మని రాలినై ఆనందరావు నోట మాట పెగలలేదు. పూర్ణచంద్రరావు వంచిన తల ఎత్తలేదు. ఒకరికేసి ఒకరుమౌనంగా దీనంగా చూసుకుంటూ నిలబడిపోయారు.

"వెళ్ళొస్తా బ్రదర్" అంటూ ఆనందరావు అక్కణ్ణుంచి కదిలాడు.

కాని అతనికేసి రెప్పవాల్చకుండా చూస్తూ పూర్ణచంద్రరావు జీవంలేని ప్రతిమలాగా కూర్చుండి పోయాడు. గడిచిపోయినకాలంలోని కలలూ, కోరికలూ, ఆశలూ, ఆశయాలూ అన్నీ ఆనందరావురూపంలో వచ్చి, తనముందర నిలబడి క్షణకాలంసేపు తనని పరామర్శచేసి తనదుఃఖాన్నీ తన పతనాన్నీ గుర్తుకి తెచ్చి దూరంగా తొలగిపోయిన ట్లనిపించింది. ఇది పరామర్శకాదు. తన గుండెల్లో మానని పుండుని మళ్ళీరేపటం. ఈప్రపంచమనే మహాసముద్రంలో ఏ తీరమో చేరాలని బయలుదేరిన తన ఓటిపడవ ఇంకే రేవుకో చేరిందని హేళనచేయటం. ఆకాశాన్నంటే కొండకొనల కెగబ్రాకాలని పరితపించి దిగజారి అధఃపాతాళంలోకి అణగారిన అభాగ్యుడికి అందుకోలేని ఎత్తులని గుర్తుకి తేవటం. గొంతు జీరపోయి మౌనంలో జీవన్మరణ యాతన అనుభవించే కోకిలకి, వసంతకాలంలో దిశాంతాలదాకా పాకిన మధుర సంగీతాన్ని గుర్తుకి తెచ్చి వేధించటం.

అవునుమరి. అందుకే పూర్ణచంద్రరావు పూర్వపుస్నేహితులకి కనబడకుండా ముఖం చాటువేశాడు. కాని అనుకోకుండా పూర్వస్నేహితు లెవరైనా కనబడి పలకరిస్తే విపరీతమైన బాధపడతాడు, తను బతికివున్న సంగతే ఎవరికీ తెలియకూడదని తంటాలు పడతాడు. అయినప్పటికీ ఇటువంటి సంఘటనలు ఎదుర్కోవలసివచ్చినప్పుడు, వధ్యశిలమీద హంతకుడి కత్తివేటుకి గిజగిజ తన్నుకునే మేకపిల్లలా గాగిలగిల లాడతాడు. కాని ఇవాళ ఆ బాధ, ఆ వేదన, ఆక్రోశం లేకపోలేదు. వాటిలోంచే ఒక చిత్రమైన అనుభవం. గడిచిపోయిన జీవితంలోని ప్రతిక్షణాన్నీ ఆ నిమిషంతాను తిరిగి జీవిస్తున్న ట్లనిపిస్తోంది. చెప్పతరంకాని అనుభవ తీవ్రతలో ప్రస్తుతమూగతమూ కలిసిపోయినై.


ఆఫీసులో కుర్చీమీద కలంచెవులో దోపి రాతిబొమ్మలాగా కూచున్నాడు పూర్ణచంద్రరావు. కాని అతనిహృదయం మాత్రం రెక్కలు కట్టుకొని ఎక్కడి కెక్కడికో ఎగిరిపోతోంది.

### 2

"నువ్వు వెయ్యి చెప్పు, లక్ష చెప్పు నే నొప్పుకోను. కళారాధనకి జీవితం అంకితం చేసుకోవాలి. ఉద్యోగం, సంపాదన, కుటుంబపోషణా ఇవే మన లక్ష్యాలయితే ఎల్లాగు ?" అన్నాడు పూర్ణచంద్రరావు.

"బాగానే వుంది నువ్వు చెప్పేది. ఇంటిదగ్గర నుంచి నాన్న నెలకి అరవై రూపాయలూ ఒకటో తేదీ కల్లా పంపుతున్నంతకాలం ఎన్ని వేషాలైనా వెయ్యొచ్చు. ఎన్నిఅవాకులూ చెవాకులయినా పేలవచ్చు. చందాలడుక్కుని జీతంకట్టి, వారాలు కుదుర్చుకుని తిండితింటూ, మీ గదిలో తలదాచుకుంటూ నాలాగా కాలక్షేపం చేసే నిరుపేదసంగతి ఏం చెబుతావు ? నేను కవిత్వం కోసం జీవితం అంకితంచేస్తానని భీష్మించుకుని కూచుంటే ఇంటిదగ్గర మా అమ్మ తమ్ముళ్ళూ చెల్లెళ్ళూ ఏమైపోవాలి ? వాళ్లకి దిక్కెవరు ? వాళ్ల సంగతి గాలికి వదిలేసి నా దోవన నేను భావకవిత్వాలతో జీవితం గడపనా ? ఛీ, అంతకంటె తుచ్ఛమైన పని ఇంకోటిలేదు" అని ఆ బృందంలో కవికుమారుడుగా పేరుమోసిన సుందర్రావు తీవ్రంగా ఎదుర్కొన్నాడు.

"అయితే నువ్వు పిరికిపందవి. పరిస్థితులకి ఎదురీదలేని పిరికివాడివి. నిజంగా నువ్వు కవివైతే అల్లా మాట్లాడవు. అన్ని శకులనీ ఎదిరించి కవితకి నీ జీవితాన్ని కర్పూరహారతిలాగా అర్పించినవాడే నువ్వు నిజమైన కవివి. లేకపోతే కవివికాదు, కాకివి !" అని ఆనందరావు దురుసుగా సమాధాన మిచ్చాడు.



స్వామి రామలేఖానంద (హృషీకేశ్) ఈ మధ్య మద్రాసులో పెద్దల సమక్షమున సమాధి చేయబడి, భూమిలో 12 గంటలసేపు వుండిరి. సమాధినుండి బైటికి తీసి స్మారకము వచ్చుటకు మంచుగడ్డ వారి తలపై రుద్దుతున్న దృశ్యం.

"నీకు మళ్లే మా నాన్నకూడా బతికివుండి నెలనెలకి వేలరూపాయిలు బాంకుల్లో పాతర వేస్తుంటే నేనూ నీకంటె ఎక్కువ కబుర్లే చెప్పేవాణ్ణి."

అని సుందర్రావు బిరుసుగా బదులు చెప్పేసరికి ఆనందరావు ముఖం ఆముదపుదీపపు కమ్మెలాగా మారిపోయింది.

అప్పుడు సుందర్రావుని చేత్తో చరుస్తూ పూర్ణచంద్రరావు ఒక సవాల్ చేశాడు. "నీకే గనక నిజంగా కవిత్వంమీద ప్రేమవుంటే జీవితాన్ని అంకితంచేస్తానని శపథంచెయ్యి. ఈ క్షణంలో నేనూ ఆనందరావూ ప్రతిజ్ఞ పూనుతున్నాం. ఎటువంటి క్లిష్టపరిస్థితులనైనా ఎదుర్కొని మా జీవితాలని కళారాధనకే నివేదన చేస్తాం. నువ్వు ఈ శపథం చెయ్యకపోతే నీ ఇష్టదేవత సరస్వతికాదు, లక్ష్మి అని మేము నిర్ధారణ చేసుకుంటాం."

"మీ ఇష్టమొచ్చిన నిర్ధారణ చేసుకోవచ్చు. నాకేమీ అభ్యంతరంలేదు. నేనుమాత్రం నెరవేర్చలేని శపథాలు చేసి నన్నూ లోకాన్నీ మోసగించుకోను. అయినా ఈ కళ్ళకి ఈ రెప్పలు అడ్డంకావు. మీ శపథాలు ఎంతవరకు నెరవేరతయ్యో చూడకపోను" అని సుందర్రావు తిరిగి సవాల్ చేశాడు.

"చూద్దుగాని. నేను సంగీతానికీ, పూర్ణ చిత్రకళకీ అంకితంకాని రోజున నీ ఇష్టమొచ్చిన శిక్ష విధించుకోవచ్చు" అన్నాడు ఆనందరావు.

"నే నెవర్ని శిక్ష విధించటానికి ? నేను విధించను, మీరు విధిస్తే నేను పడను" అని సుందర్రావు వివాదాన్ని తెంపేసి లేచి వెళ్ళిపోయాడు.

### 3

"ఎంత కష్టం వచ్చిందిరా పూర్ణా ? తండ్రిచాటున పెరిగినవాడిమీద సంసారభారమంతా పడిందికదా. ఎల్లా మోస్తావో నాయనా !" అంటూ చూడటానికి వచ్చిన చుట్టం ఓదార్చబోయాడు. పూర్ణచంద్రరావు కన్నీళ్లు కట్టతెగిన ప్రవాహంలాగా పొంగుకొచ్చినయ్. పసిపిల్లవాడిలాగా ఏడ్చాడు.

నిజంగా పూర్ణచంద్రరావు తండ్రిచాటునే పెరిగాడు. తండ్రి వున్నన్ని రోజులూ కష్టమనేది ఎరగకుండా కాలం గడిపాడు. తను చీమకుట్టినంత బాధ పడి ఎరుగడు. తనేకాదు కుటుంబంలో ఒక్కరూకూడా ఒక్కనాడైనా కష్టమంటే ఏమిటో ఎరగరు. ఒంటి స్తంభం మీద మేడబరువంతా ఆనినట్టుగా తండ్రి మీదుగానే కుటుంబభారమంతా వెళ్ళిపోయింది. ఇంత బరువుమోస్తున్నానని ఒక్కనాడైనా విసుక్కొని ఎరగడు. తను ఇంత డబ్బు ఎక్కడనుంచి కుటుంబ మర్యాదకి భంగంలేకుండా వైభవంగా జీవితంగడిపేవాడో ఎవరికీ తెలియదు. ఏదో గనిలోంచి తవ్వుకు వచ్చినట్లుగా తండ్రి రెండు చేతులా ఖర్చుపెడుతున్నంత కాలమూ పూర్ణచంద్రరావుకి ఇదంతా ఎక్కడినుంచి వస్తోందనే ఆలోచనే పోలేదు. అంత గుట్టుగా ఏ లోటూ రాకుండా, ఎవరికీ కష్టం తెలియకుండా తండ్రి సర్దుకునే వాడు.

తమ వైభవమంతా తండ్రితోనే పోయింది. తమ సంపద అంతా చమురు అడుగంటి పోయిన దీపంలాగా కొండెక్కిపోయింది. తండ్రి పోవటంతోటే పూర్ణచంద్రరావు నెత్తిన మోయలేని బరువు అమాంతంగా వచ్చిపడింది. ఇంతకాలమూ ఆ బరువంతా తండ్రి ఒక్కడే మోసేవాడు.

ఇప్పుడు వెలుతురును తరుముకు వచ్చే చీకటిలాగా దురదృష్టం వెన్నంటి తరమటం ఆరంభించింది. తండ్రి చేసిన అప్పులు ఒకటి తీర్చినాక ఒకటి మెల్లి మెల్లిగా బైటపడటం సాగించినై. వెండి కంచాలలోంచి అన్నం విస్తరాకుల్లోకి దిగింది. పందిరిమంచాలలోంచి ఒక్కసారిగా నులకమంచాలలోకి మారింది. తండ్రికట్టిన దివాణం లాటి మేడలోంచి కాపురం పూర్వపు గొడ్ల పాకల్లోకి మార్చవలసి వచ్చింది. లేదు అనేమాట వినబడని ఆ యింట్లో ఇప్పుడు ప్రతిదానికి వెతుక్కోవటమే.

అదీకాక కొత్తగా ప్రాప్తించిన వైధవ్య దుఃఖంతోనూ, భర్తచావుతోబాటు తమ తాహతులో వచ్చిన మార్పుకు అభిమానంతోనూ మగ్గిపోతున్న తల్లిని తలచుకోగానే పూర్ణచంద్రరావు గుండె నీరైపోయింది. పెళ్ళికి ఎదిగిన చెల్లెలూ, ఒళ్ళోవెయ్యవలసినతమ్ముడూ, రేపటి సంగతి ఎల్లాగా అని దిగులు...

సరిగా అదే సమయానికి భార్య కాపరానికి వచ్చింది. తమ కుటుంబం మంచి స్థితిలో వుండగా ఇచ్చిన సంబంధం. గొప్ప యింటి బిడ్డ. ఆమెకి తన పేదరికాన్ని తెలియనీ కూడ దని మొదట ఎంతో తిప్పలు పడ్డాడు. పూట గడవటానికే గండంగా వుంటే ఇటువంటి బూటకపు నాటకా లెన్నాళ్లు సాగుతై ? చివరికి భార్య పూర్ణచంద్రరావు పరిస్థితి గ్రహించి తనంతట తాను మెళ్లో బంగారు గొలుసు తీసి యిచ్చింది.

ఇక ఇంట్లో ఎత్రని ఏగాని లేదు ? జీవనం ఎల్లాగు ? ముందుగతి ఏమిటి ? ఈ చిక్కులోంచి బైటపడే దారి ఏది ? యావజ్జీవితమూ కళాసేవకుడిగా గడపాలని సంకల్పించుకున్నాడు. పరిస్థితులను ఎదిరించి కళకే జీవితాన్ని అర్పిస్తానని చాటించాడు. ఇప్పుడు ఏం చెయ్యాలి ? తను వేసిన బొమ్మలు అమ్మ ఆకలిని తీర్చగలవా ? తమ్ముడికి చదువు చెప్పిస్తయ్యా ? చెల్లెలికి పెళ్ళి చేయిస్తయ్యా ? భార్య ఆర్తిని తీర్చగలవా ? మరి ఎందుకీ కళ ! ఇంతజీవితం ధారపోసి తపస్సు చేసి తాను సాధించిం దేమిటి ? తన కలలన్నీ ఏమైపోయినై ? తన ఆదర్శాలన్నీ ఏమైపోయినవి ? కళాజీవిగా బతకదలుచుకుంటే దమ్మిడీ సంపాయించకుండా ఇంట్లో అందరినీ పస్తుపడుకోబెట్టాలి. కుటుంబభారాన్ని మీద వేసుకుని ఈదాలంటే ఇన్నేళ్ళనుంచీ తను ఆరాధించిన కళకి తిలోదకాలివ్వాలి. ఏం చెయ్యటం ? ఏది దారి ? అనే ఆవేదనతో వేగిపోతూ పూర్ణచంద్రరావు తను ఎంతో కష్టపడి వేసిన బొమ్మలన్నీ బైటికి తీశాడు. ఒకటి ఊర్వశి, ఇంకోటి రాధాకృష్ణ, మరొకటి నగ్నసుందరి. అన్నీ ముందు పరుచుకుని కూచున్నాడు. ఇంతకాలమూ జీవితంలోని బాధలూ కష్టాలూ సోకకుండా దూరంగా నిలబడి కళా స్వప్నంతో సౌందర్య సృష్టిచేశాడు. ఏబాధా పట్టించుకోకుండా తిరిగినందుకే జీవితం ఒక్కసారిగా తారుమారై తనమీద కసి తీర్చుకుంటోంది కాబోలు ! ఇప్పుడు మునుపటి బొమ్మలన్నీ కష్టాలలో చిక్కుకుని తన్నుకుంటూన్న తనకేసి చూసి వికటంగా నవ్వుతున్నయ్. వాటి పరిహాసం దుర్భరమై పోయింది. ఇంతకాలం తనరక్తం రంగులుగా దిద్దిన బొమ్మలు ఇంతదీనమైన స్థితిలో తనమీద సానుభూతి చూపటంలేదు. పైగా వాటిముఖవైఖరి తనని వెక్కిరిస్తున్నట్లుగా తన సృష్టే తనమీద ఎదురు తిరిగింది. తనవీపుమీద చురుక్కున చరిచి నిద్ర లేపింది. లేచేసరికి ఏముంది ? ఆకలి ! ఆకలి ! శోకం ! భీకరలోకం...

పూర్ణచంద్రరావు పూనకం పూనినవాడిలాగా తన బొమ్మలన్నీ పోగుపెట్టి నిప్పంటించి కసి తీర్చుకున్నవాడిలాగా వికృతంగా దిక్కులు దద్దరిల్లే నవ్వు నవ్వాడు.

### 4

"సార్, అయ్యగారు పిలుస్తున్నారు !" అని బంట్రోతు పిలిచాడు.

"వస్తున్నా" అని గుమాస్తాకుర్చీలోంచి ఉలిక్కిపడిలేచాడు పూర్ణచంద్రరావు. ఆ నిమిషంలో అతని బొమ్మలన్నీ తన గుండెల్లో మళ్లీ తగలడిపోతున్నయ్. ఇప్పుడు నవ్వలేదు. ఏడవనూ లేదు. ఓడిపోయినవాడిలాగా సిగ్గుతో తల వంచేసుకుంటాడు. ఎందరి హృదయాలలోనో వికసించిన స్వప్నకుసుమాలని తన కాళ్ళకింద వేసి మట్టగిస్తూ శిథిల తాండవం చేసే జీవితాన్ని చూసి చెదిరిపోయి కళ్ళుమూసుకుంటాడు.

కాని చిత్రం—జీవితంలో సుందర్రావు కవిగానే బతుకుతున్నాడు. ఆనందరావురికామీ. సరే, పూర్ణచంద్రరావు తాలుకాఫీసు గుమాస్తా అని వేరే చెప్పాలా ?


**నెరసిన వెంట్రుకలఔషధము**

రంగు పూయనక్కరలేదు. ఆయుర్వేద చికిత్స. తెల్లని రంగును మార్చి శాశ్వతముగా వెంట్రుకలకు నలుపు విచ్చును. గుణం కావిచో, డబ్బు వాపసు చేయబడును. తెలుపు కొంచమైయుండిన రూ 2-8-0; మధ్యరకమై యుండిన రూ 3-8-0; పూర్తిగా యుండిన రూ 5-0-0.

గమనింపు:-ఇది మెదడుకు కంటికి మంచి పోషణ విచ్చు ఔషధము.

**Bharat Kalyan Aushadhalaya,**
**P. O. Raniganj, (Burdwan.)**